# సిరికొండలో నిజామాబాద్ కలెక్టర్ హల్‌చల్

## పాఠశాలలు, ప్రజా పాలన కేంద్రం తనిఖీ



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సిరికొండ, జూలై 23: మండలంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రజా పాలన సేవా కేంద్రం, గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలతోపాటు పెద్దవాల్గోట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు.ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పనులు పూర్తయినవాటికి తక్షణమే ఎంబీ రికార్డు చేయాలని అధికారులను ఆదేశించారు. తుది దశలో ఉన్న పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.విద్యార్థుల సంఖ్య తెలుసుకొని ఉపాధ్యాయుల సమయపాలనపై ఆరా తీశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును పరిశీలించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న విద్యా బోధనతో పాఠాలు సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నామని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించి,వారికి అందిస్తున్న బోధన తీరును గమనించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు.రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉంటున్నాయా అని ఆరా తీశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని మందులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించించారు. గిరిజన పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సమకూర్చిన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, మండల ప్రత్యేకాధికారి నాగురావు, జిల్లా వైద్య రోగ్య శాఖ అదికారి డాక్టర్ తుకారాం, పంచాయతీరాజ్ ఈఈ శంకర్ నాయక్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తహసీల్దార్ రవీందర్‌రావు ఉన్నారు.

# నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేపడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమావతి

మాక్లూర్, జూలై 23: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించి గత చైర్మన్ల హయాంలో జరిగిన అవకతవకలపై సోమవారం విచారణ ప్రారంభమైంది. సుమారు రూ.2 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు పత్రికల్లో కథనాలు రావడంతోపాటు, సంబంధిత అధికారుల తనిఖీల్లోనూ తేలింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు సొసైటీలో కార్యదర్శిగా పనిచేసిన సంతోష్‌కుమార్‌ను సోమవారం విచారించారు. 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించిన లావాదేవీల వివరాలను సంతోష్‌ను అధికారులు అడిగారు. ఆ రెండేండ్ల రికార్డులు సొసైటీలో లేవని, జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో ఉన్నాయని బుకాయించగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమావతి జిల్లా అధికారులను ఫోన్‌లో రికార్డులకు సంబంధించి వివరాలు అడిగారు. రికార్డులు ఇక్కడ లేవని, మాక్లూర్ పీఏసీఎస్‌లోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. రికార్డులు ఇక్కడే ఉండాలి, అక్కడ ఎందుకుంటాయని సంతోష్‌ను మందలించగా.. రెండేండ్లకు సంబంధించిన రికార్డులను తెచ్చి అధికారుల ముందుంచాడు. సొసైటీలో జరిగిన భారీ కుంభకోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, దీనికి సంబంధించిన అందరినీ విచారించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. తనిఖీలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జియావోద్దీన్, విచారణ అధికారిణి, సీఈవోలు సంతోష్‌కుమార్, విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ దవాఖానను సందర్శించిన

# న్యూఢిల్లీ ప్రత్యేక బృందం

ఖలీల్‌వాడి, జూలై 23: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను న్యూఢిల్లీ ప్రత్యేక బృందం సందర్శించింది. దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌తోకలిసి గాలి ద్వారా (క్షయ)సంక్రమించే వ్యాధులపై చర్చించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. దగ్గు, జలుబు, అంతర్గత అవయవాలు, జ్వరం, దీర్ఘకాలిక దగ్గు, ఆకలి లేకపోవడం, నిద్రలేమి, బరువు తగ్గడం ఇలాంటివి ఉంటే వెంటనే క్షయ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దేశ వ్యాప్తంగా 185 క్షయ నియంత్రణ సెంటర్లు ఉన్నాయని, ఇందులో నిజామాబాద్ ఒకటని,అందుకోసం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చినట్లు తెలిపారు. దవాఖానలో ఇప్పటికే అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కేంద్ర బృందంలోని సభ్యులు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ భరత్‌కూమార్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీలోకి 25,490 క్యూసెక్కుల వరద

మోర్తాడ్, జూలై 23: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి మంగళవారం వరకు 25,490 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా, మంగళవారం ప్రాజెక్ట్‌లో 1069.9 అడుగుల (23.122 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నది.














